

# ఓటికుండలు

## వి.యస్.చెన్నూరి

నేను గుమ్మంలో అడుగు పెట్టానో లేదో లోపల్నుండి బాబాయిగారి కేకలు గట్టిగా వినిపిస్తున్నయ్.

బాబాయిగారికి ఎప్పుడోతప్ప కోపం రాదు. వస్తేమాత్రం ఇల్లుపీకి పందిరి వేశారన్న మాటే. ఆయన కంత కోపం తెప్పించిన విషయమేమిటో అర్థంకాక గుమ్మంలోనే ఆగిపొయ్యాను.

బాబాయి నా రాకను గమనించారు కాబోలు, గిరుక్కున వెనక్కితిరిగి, "రావోయ్‌రా! అక్కడే ఆగిపొయ్యావేం? లోపలికి వచ్చి నీ ముద్దుల చెల్లాయి చేసిన నిర్వాకం కాస్తావిని నువ్వూ ఆనందిద్దువుగాని" అన్నారు గొంతుక తగ్గించి, ఆవేశాన్ని అతిప్రయత్నంమీద అణుచుకుంటూ.

అసలు ఏంజరిగిందో అర్థంకాక అడుగు ముందుకి వేసి లోపలికి చేరుకున్నాను. పిన్ని మంచంలో కూలబడి, పమిటచెంగుతో కళ్ళు తుడుచుకుంటూ, కూతుర్ని ఓదారుస్తోంది. చెల్లాయి తల్లి వొడిలో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది. ఎవరూ జరిగినదేమిటో చెప్పే స్థితిలో లేరు.

చివరికి బాబాయే తన ఆవేశాన్ని పూర్తిగా దిగమింగి, బరువుగా నిట్టూర్చి, తనతో లోపలికి రమ్మన్నట్టు నాకేసి తలూపి, తన ప్రైవేట్ రూముకేసి దారి తీశారు.

బాబాయి ఓ కుర్చీలో కూలబడి, నన్నూ కూచోమన్నట్టు పక్కనున్న కుర్చీ వేసి తలూపాడు. కిమ్మనకుండా కుర్చీలో కూలబడ్డాను.

ఒక్క నిమిషంపాటు మా యిద్దరిమధ్య భయంకర నిశ్శబ్దం!

బాబాయి ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తున్నాడు. గొంతు పెగలడంలేదు. నా గుండె వేగంగా కొట్టుకుంటోంది.

"సరస్వతి యింతపని చేస్తుందనుకోలేదు" అన్నారు బాబాయి అతి ప్రయత్నం మీద "ఈ రహస్యం బైట పడిందంటే మన పరువూ ప్రతిష్ట మంట గలిసినట్టే!"

నేను మాట్లాడలేదు. అయోమయంగా వుంది. అసలు విషయమేమిటో చెప్పమని నిలదీసి ప్రశ్నించే ధైర్యం లేదు నాకు.

"సరస్వతి నెల తప్పిందట!"

నా తల మీద పిడుగు పడ్డట్టయింది. ఒక్కక్షణం బుర్ర పనిచెయ్యడం మానివేసింది.

సరస్వతికి పదహారేళ్ళ వయసులోనే పెళ్ళి చేశారు బాబాయి. దాని కర్మకాలి ఏడు తిరక్క ముందే 'అతగాడు' కాస్తా హరీ మన్నాడు.

బ్బుచేసి. నలుగురు పెద్దలూ చేరి సరస్వతి నుదుటి కుంకుమ చెరిపేశారు. గాజులు పగుల గొట్టారు — పూలు పెట్టుకోవద్దని శాసించారు.

ఈ హటాత్ పరిణామంతో సరస్వతి మానసికంగా దెబ్బతిన్నది. ఎప్పుడూ హుషారుగా నవ్వుతూ తుళ్ళుతూ తిరిగే సరస్వతిలో ఏదో నిర్లిప్తత చోటు చేసుకుంది. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ విరాగినిలా కనిపించేది. ఒక్కసారిగా దాని వయసు మరో ముప్పయ్యేళ్ళు పెరిగి నట్టయింది. తల దువ్వుకోవాలన్నా మంచి బట్టలు కట్టుకోవాలన్నా దానికి మనస్కరించేది కాదు. తన గది వొదలి బైటికి వచ్చేది కాదు. మగ గొంతుక వింటేచాలు, దెబ్బతిన్న లేడిపిల్లలా బెదిరి, పారిపోయి ఏ మూలనో నక్కేది. కనీసం వీధి గుమ్మంకేసి చూడ్డానికి సైతం సాహసించేది కాదు. తల్లితో సైతం గొంతెత్తి మాట్లాడేది కాదు. సరస్వతి స్వతహాగా అట్టే ధైర్యవంతురాలు కాదు. ఈ సాంఘిక కట్టుబాట్లూ, ఆంక్షలూ, సాంప్రదాయాలూ ఆమెను మరింత పిరికిదాన్ని చేసినయ్. అలాంటి సరస్వతి 'తప్పటడుగు' వేసిందంటే ఎందుకో నమ్మ బుద్ధి కాలేదు.

## ఓటికుండలు

"వాడెవడో తెలిస్తే నయానో భయానో వాడికి అంటగట్టి చేతులు దులుపుకోవచ్చు. అడిగితే చెప్పదు. ఆ ప్రసక్తి తెస్తే చాలు భావురు మంటుంది. అసలే దానికి అభిమానం జాస్తి. ఎప్పుడు, ఏ క్షణాన, ఏం అఘాయిత్యం చేస్తుందోనని భయంగా వుంది!" బాబాయి కర్చీఫ్‌తో కళ్ళు తుడుచుకున్నారు.

తండ్రిగా బాబాయి పడుతున్న మనోవేదన నాకు అర్థం కాకపోలేదు. కాని నాకాయన పట్ల సానుభూతి కలగలేదు సరికదా అసహ్యమేసింది.

ఈ అనర్థానికి కారణభూతుడు బాబాయే.

సరస్వతికిప్పుడు ఇరవైయేళ్ళు కూడా నిండలేదు. సన్నగా, పొడుగ్గా బంగారు బొమ్మలా వుంటుంది. చెంపకి చేరడేసికళ్ళు, కొనతేరిన ముక్కు, ధనుస్సులా వొంగిన పెదాలుసాక్షాత్తు బాపూబొమ్మలాగుంటుంది. అందానికి తోడు వినయవిధేయతలూ, తెలివితేటలూ కూడా వున్నయ్. ఆధునిక భావాలు గల యువకుడెవడైనా సరే, ఆమెను మళ్ళీ పెళ్ళి చేసుకునేందుకు వెనుకాడడు.

ఈ విషయమే నేనోసారి బాబాయితో అన్నాను. వెంటనే ఆయన నామీద విరుచుకపడ్డారు.

"మనది సాంప్రదాయమైన కుటుంబం. ఇలాంటివి మన ఇంటా వొంటా లేవు. తర తరాలుగా వస్తున్న మన వంశ పరువు ప్రతిష్టలు యిలా గంగపాల్జెయ్యడం నాకిష్టంలేదు. మరెప్పుడూ యిలాంటి ప్రసక్తి నా దగ్గర తీసుకు రాకు!" అన్నారు.

ఆ నాడు అలా అన్న వ్యక్తేనా యీ నాడు ఇలా అంటున్నది ?

కొందరు పీకలమీదికి వస్తేతప్ప దేన్ని గురించీ ఆలోచించరు. ముందుగా తీసుకోవలసిన జాగ్రత్తలు తీసుకోరు. చేతులుకాలాక ఆకులుపట్టేవాళ్ళంటే నాకు పరమ అసహ్యం.

"వాడు ఫలానా అని తెలిసినంత మాత్రాన మనకు వొరిగేదేమిటి? వాడి పెళ్ళికి వొప్పుకో వద్దూ? నాకేమీ తెలీదు పొమ్మంటే మనం చేసేదేమిటి?" అన్నాను.

బాబాయి ఒక్క క్షణం ఆగి తలూపి, "నిజమే, మనబిడ్డ అల్లరిపాలు గావడమేగాని, మనకి వొరిగేదేమీలేదు" అన్నారు నిస్పృహగా.

మా యిద్దరిమధ్య మరో నిమిషం నిశ్శబ్దంగా గడిచిపోయింది.


Join at Once

BEST RESULT! VERY LOW FEE!! EFFICIENT POSTAL COACHING!!!

**POPULAR & EFFICIENT EDUCATIONAL INSTITUTE IN THE WORLD !**

**Recognised and Affiliated with I.A.E., I.B.A.M & COM. UNIVERSITY**

1. M.B.A., M.B.M., A.M.I.B.M., D.B.A., D.B.M., L.L.B. & B.G.L. (All degree Holders are eligible)
2. MYSORE/ANDHRA B.A., B.Com. & ANDHRA MATRIC (No Previous School or College study is required)
3. OSMANIA B.A., B.Com., (One sitting) (P.U.C./INTER Passed are allowed)
4. S.V. M.A., M.Com 5. COM. UNIVERSITY: INTER, D.Com, B.Com, B.Com (Hons) & M.Com. (No previous School/College study is required)
6. A.M.I.E. (Civil/Mech/Electrical) & A.M.I. Mech. E Equalent to B.E. (S.S.L.C., S.S.C., H.S.C., P.U.C., INTER PRE-DEGREE, ENGG. DIPLOMA HOLDER, B.Sc. Passed/Failed are eligible) 7. BANK OFFICER/CLERKS
8. ACCOUNTANCY 9. ALLOPATHY 10. SERVICE COMMISSION 11. HIGHER SECONDARY.

*For full particulars please send Rs. 3/- by M.O.*

GUARANTEE CERTIFICATE WILL BE ISSUED

**SRI MURUGAN TUTORIALS**

(Estd. 21-3-1952 Govt. Regd. No.: 3072) H.O: RISHIVANDIYAM, 606 205-TAMILNADU

REGIONAL OFFICE: 41, ARCOT ROAD, KODAMBAKKAM MADRAS-600 024. PHONE: 426460

"మీ మిత్రుల్లో ఎవరైనా ముందు కొస్తారేమో విచారించు. సాధ్యమయినంత త్వరలోనే ఆ మూడు ముళ్ళూ వేయించాలి. ఆలస్యం జరిగితే రహస్యంకాస్తా బైటికి పొక్కవచ్చు!" బాబాయి గొంతుకలో భయాందోళనలు స్పష్టంగా ప్రతిధ్వనించాయి.

నాకు నవ్వాలో ఏడవాలో తోచలేదు.

ఒకేఒక్క సంఘటనతో బాబాయి పూర్తిగా మారిపొయ్యారు. ఇంతకాలం తాను మన స్ఫూర్తిగా నమ్ముతూ వచ్చిన సత్సాంప్రదాయాన్నీ, సనాతనధర్మాన్నీ మంటగలిపి, విధవా వివాహాన్ని తన చేజేతులా చెయ్యడానికి సంసిద్ధులవుతున్నారు. విధవావివాహప్రసక్తి తెస్తేనే అగ్గిలోవేసిన గుగ్గిలంలా భగ్గుమనే బాబాయి, ఇంతగా మారిపొయ్యారంటే కారణం స్వార్థం! పూర్వాచార పరాయణుల దృష్టిలో తాను ఓ కులభ్రష్టుడుగా దిగజారిపోయినా, సంఘ సంస్కారంపట్ల ఆసక్తిగల ఆధునికుల దృష్టిలో కనీసం ఓ చిన్నసైజు సంఘసంస్కర్తగా పేరుప్రతిష్టలు తెచ్చుకోవచ్చన్న ఆశకాబోలు! ఎంత స్వార్థం! ఏ ఎండ కాగొడుగు పట్టడం, సమయాను కూలంగా ప్లేటు ఫిరాయించడం లాంటి 'ఘన' కార్యాలనే లౌక్యం అంటారు! స్వార్థానికి మారుపేరు లౌక్యం! మానవుడు ఎంత స్వార్థపరుడు!

నాకెందుకో బాబాయిమీద దెబ్బతీయా లనిపించింది.

"పెళ్ళంటే క్షణాలమీద జరిగే పనికాదు. పైగా యిలాంటి రహస్యాలు దాస్తే దాగేవి కావు. ముందు జాగ్రత్త లేకపోవడం మన అవివేకం. చేజేతులా చేసుకున్నవి మనం అనుభవించక తప్పదు!"

బాబాయి బిక్కమొహం పెట్టారు. ఆయన ముఖంలో దైన్యం కొట్టొచ్చినట్టు కనిపించింది. కళ్ళల్లో నీళ్ళుకూడా తిరిగాయి. అంత అనుభవజ్ఞుడు అలా నీరుగారిపోవడం చూచేసరికి నాకు జాలేసింది.

"అయినా ప్రయత్నిస్తాను. నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. సరస్వతిని జాగ్రత్తగా చూచుకోండి! రహస్యం బైటికి పొక్కకుండా జాగ్రత్త పడండి!" అన్నాను.

పాపం బాబాయికి కాస్త ధైర్యంచిక్కింది కాబోలు. బరువుగా ఓ నిట్టూర్పు విడిచి, "అలాగే" అన్నట్టు తలూపారు.

సాయంత్రం ఆరయింది.

ఊరిబయట ప్లేగ్రౌండు పక్కనున్న పబ్లిక్ పార్కులోకి మిత్రులందరూ ఒక్కొక్కరుగా చేరుకుంటున్నారు. బొగడచెట్టు క్రింద సిమెంటు బెంచీలమీదా, పచ్చని తివాచీ లాంటి పచ్చికమీదా బైటాయిస్తున్నారు.

అక్కడ చేరిన నా మిత్రుల్లో కొందరు నాటకాల్లో వేషాలువేసే కళాకారులు, కొందరు వేదికలెక్కి ఎలాంటి విషయం మీదయినా గంటలతరబడి మాట్లాడగల మహావక్తలు, మరికొందరు పత్రికలకి కథలూ, వ్యాసాలు గుప్పించే మహారచయితలు. దాదాపు అందరూ డిగ్రీలు పుచ్చుకున్నవాళ్ళే. సాంఘిక సంస్కరణలపట్ల ఆసక్తి కనపరిచే ఆధునిక భావాలుగల యువకులు. ఒకరో ఇద్దరో తప్ప అందరూ అవివాహితులే. బుద్ధావతారం లాంటి శ్రీమంతుల అనుంగుబిడ్డలు ఇద్దరో ముగ్గురో తప్ప అందరూ తమ కాళ్ళమీద లాము నిలబడగల శక్తిసామర్థ్యాలు గలవాళ్ళు. కొందరు ఉద్యోగాలు వెలగబెడుతూంటే, మరి కొందరు వ్యాపారంలో గడిస్తున్నారు. స్వతంత్ర భావాలుగల వ్యక్తులు.

నేను సిమెంటు బెంచీమీద నిల్చుని "డియర్ ఫ్రెండ్స్! నేనిప్పుడు మీకో శుభవార్త వినిపించబోతున్నాను" అన్నాను.

చెల్లాచెదురుగావున్న మిత్రులందరూ నా చుట్టూ మూగారు. ఒక్కసారి అక్కడ గుమిగూడిన మిత్రులందరికేసీ కలయజూచాను. ఒక్క బుద్ధావతారం తప్ప మిత్రులందరూ హాజరైనట్టే. నేనేర్పాటుచేసిన యీ సమావేశానికి బుద్ధావతారం రాకపోయినా ఫరవా లేదు. కాని వాడు రాకపోతే యీ సమావేశం పూర్తయినట్టు వుండదు.


వాడు మా చర్చల్లో ఎప్పుడూ పాల్గొనే వాడు కాదు. కాని ప్రతి సమావేశానికి తప్పకుండా హాజరవుతాడు. మెజారిటీ తీసుకున్న నిర్ణయాన్ని తు. చ. తప్పకుండా పాటిస్తాడు. సభమధ్య నిండుగా కూలబడి మేము మా చర్చల్లో మునిగి తేలుతూవుంటే, వాడు ఎక్కడో శూన్యంలోకి చూస్తూ వుండేవాడు. లేదా కూచునే గుర్రుపెట్టి నిద్రపొయ్యేవాడు.

వాడిపేరు శేషావతారం. కాని మిత్రులందరూ వాడ్ని బుద్ధావతారం అని ముద్దుగా పిలుచుకుంటారు. వాడికి ఏ విషయం మీదయినా సొంత అభిప్రాయాలంటూ వుండవనీ, సొంత బుర్రతో ఆలోచించే అలవాటు వాడికి లేదనీ, అసలు వాడి బుర్రలో వున్నది బంకమన్నేననీ అందరూ అనుకుంటూ వుంటారు.

వాడిది ఆరడుగుల నిండు విగ్రహం. కండలు తిరిగిన శరీరం. ఒక్క ఆటల్లో తప్ప వాడు ఎందులోనూ ఆసక్తి చూపేవాడుకాదు. కాని స్నేహపాత్రుడు. స్నేహానికి చాలా విలువ నిచ్చేవాడు. వాడి అండదండలు లేకపోతే మేము ఏ రంగంలోనూ ముందుకి వెళ్ళలేము. ధైర్యసాహసాల్లో వాడికి వాడేసాటి. అడుగు ముందుకివేస్తే వెనక్కి తియ్యడం వాడికి అలవాటు లేదు. వాడిది ఎప్పుడూ ముందు చూపే.

అందుచేత వాడులేని యీ సమావేశం వుప్పులేని పప్పులాంటిది.

నేనిలా ఆలోచిస్తూనేవున్నాను. వాడెక్క



ఆంధ్రపత్రిక దినపత్రికలో
అడవాళ్లకి అన్నీ ఆకర్షణలే వెలువడుతున్నాయి !

ఉత్తమ బహుమతి
వివాహాది శుభకార్యాలకు, బహుమతి ఇచ్చేందుకు రుచికరమైన వంటకాలకు ప్రసిద్ధిచెందిన పుస్తకం
శ్రీమతి మాలతీ చందూర్
వంటలు - పిండి వంటలు రు. 20-00
అన్ని పుస్తకాల షాపులలోను దొరుకుతుంది లేదా ఒక రూపాయి తగ్గించి
M.O. పంపినవారికి ఆ రూపాయికి V.P.P సెటి పంపుతాము
క్వాలిటీ పబ్లిషర్స్, రామమందిరంవీధి, విజయవాడ 2

మీ గృహాలంకరణకు
కావలసిన
ఫర్నిషింగ్స్, డోర్ కర్టెన్స్
బెడ్ షీట్స్, టవల్స్
కార్‌సీట్ కవర్స్
ఆకర్షణీయమైన రంగులలో
అసంఖ్యాకమైన డిజైన్లలో
లభించును.
PHONE: 73708
డెకొర్స్
V.H.R. కాంప్లెక్స్
బీసెంట్ రోడ్
విజయవాడ-2

బాధారహిత ప్రకృతిసిద్ధమైన ఆరోగ్యము మీదే!
స్త్రీల బాధలు ప్రత్యేకమైనవి
లోధ్ర
75 సంవత్సరములకు పైగా
సుఖజీవనమునకు
లోధ్ర టానిక్‌ను
వాడిన స్త్రీలు ఎందరో!
ఉచిత వైద్య సలహాకు
ఈ క్రింద పేర్కొనబడిన విలాసమునకు
ఈ కూపన్‌ను పూర్తిచేసి మీ జాబుతో పంపండి.
పేరు
విలాసము
PIN


కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్ రాయపేట, మద్రాసు-14
ఏజంట్లు: శీతారామ జనరల్ స్టోర్స్ ఏజన్సీస్ విజయవాడ — సికిందరాబాద్ —

## ఓటి కుండలు

డ్నించో గాలిదుమారంలా దూసుకు వచ్చేస్తున్నాడు. తెల్లనిక్కర్లో తెల్లబనీను టక్‌చేసి, చేతిలోని టెన్నిస్ రాకెట్‌ను గాల్లో వూపేసు కుంటూ, పద్మవ్యూహాన్ని భేదించిన అభిమన్యుడిలా నాముందు నిల్చున్న మిత్రుల మధ్యలోంచి నాముందు ప్రత్యక్షమయ్యాడు.

"సారీ బ్రదర్ ! ఆలస్యమైపోయింది !" క్షమాపణ చెప్పుకున్నాడు, చెంపలమీదుగా క్రిందికి జారుతున్న చెమట బిందువుల్ని కర్చీఫ్‌తో తుడుచుకుంటూ.

నేను గొంతు సవరించుకున్నాను

"మా బాబాయినీ ఆయన కుమార్తె సరస్వతినీ మీరెరుగుదురు. సరస్వతి పెళ్ళి విషయమై మా బాబాయి మనసు మార్చ డానికి నేనెంతగా ప్రయత్నిస్తున్నానో కూడా మీకు తెలుసు !"

"అవును. తెలీకేం ?"

"ఇంతకాలానికి నా ప్రయత్నం ఫలించింది !"

"ఏమిటీ ? మీ బాబాయి మీ చెల్లాయి 'మళ్ళీ పెళ్ళి'కి వొప్పుకున్నారా ?" ఎవరో ప్రశ్నించారు

"అవును, వొప్పుకున్నారు"

"అచీవ్‌మెంట్ ! - ఇటీజ్ – ఎ – గ్రేట్ సక్సెస్ !" ఎవరో అభినందించారు పెద్దగా గొంతెత్తి.

"నో! ఆయన 'ఋూ పెళ్ళి'కి వొప్పుకున్నంతమాత్రాన నా ప్రయత్నం నూటికి నూరుపాళ్ళు ఫలించినట్టు కాదు సరస్వతికి పెళ్ళి జరిగిపోవాలి! సాధ్యమయినంత త్వరలోనే ఋూ పెళ్ళికాస్తా అయిందనిపించాలి! అప్పటికి గాని నా ప్రయత్నం ఫలించినట్టుకాదు. ఈ నెలలోనే మంచి ముహూర్తాలున్నాయట. మీలో ఎవరైనా ముందుకివస్తే..." మాట పూర్తి చెయ్యకుండానే మిత్రబృందంకేసి దృష్టి సారించాను.

ఎవరూ మాట్లాడలేదు. ఎవరి ముఖంలోనూ ఇంతక్రితం వున్న హుషారు కనిపించలేదు. ఒకరిముఖాలొకరు చూచుకోవడమే తప్ప ఎవరూ నోరు కదపలేదు.

"అంత తొందరెందుకో ?" ఎవరో ప్రశ్నించారు.

"అవును. ఇంతకాలంగాలేని తొందర యిప్పుడెందుకొచ్చిందని మీరడగడంలో అర్థం

లేకపోలేదు. అసలు నేనెందుకింత తొందర పడుతున్నానో చెప్పవలసిన బాధ్యత నా మీదుంది. చెబుతున్నాను!'' గొంతు సవరించు కుని చెప్పడం మొదలెట్టాను. ''మాబాబాయి ఎంత ఛాందసుడో మీకు తెలీందికాదు. ఆయన మనసుమార్చడానికి మూడేళ్ళపాటు నేనెంతగా ప్రయత్నించానో మీ అందరికీ తెలుసు.ఆలస్యం జరిగితే ఆయన మనసు మారిపోవచ్చు. మొగుడు చచ్చినదానికి మళ్ళీ పెళ్ళేమిటి— నాన్సెన్స్! అని ఎదురు తిరగవచ్చు అప్పుడు నా ప్రయత్నం మళ్ళీ మొదటికొస్తుంది. ఇంతకాలంగా నేను చేసిన ప్రయత్నమంతా వృధాఅవుతుంది. అందుకని ఈ పెళ్ళి సాధ్య మయినంత త్వరలో జరిగిపోవాలని నా అభిమతం!!'

''కరెక్ట్! యూ ఆర్ సెంటుపర్సెంట్ కరెక్ట్!'' ఎవరో నా వాదాన్ని బలపరిచారు.

రెండు మూడు నిముషాలు గడిచిపోయి నయ్ కాని నా అభ్యర్ధనకు జవాబు మాత్రం లభించలేదు.

'అందరూ ఆదర్శాలను వల్లించేవాళ్ళే. సాంఘికసంస్కరణల్ని గురించీ, విధవావివాహాల గురించీ వేదికలెక్కి అనర్గళంగా ఉపన్యసించే వాళ్ళే నాటకాలద్వారా ప్రజల్ని వుద్బోధించే వాళ్ళు, రచనలద్వారా పాఠకుల్ని వుత్తేజితుల్ని చేసేవాళ్ళు. అవకాశం ఎదురైనప్పుడు అడుగు ముందుకి వెయ్యరేం? ఆదర్శాలు కేవలం ప్రజలముందు వల్లించ డానికేనా ? ఆచరించడానిక్కాదా ? వీళ్ల మాటలన్నీ నీటిమూటలేనా ? వల్లించే ఆదర్శాలన్నీ వొట్టి బూటకాలేనా ? ఇంత మందిలో కనీసం ఒక్కడికి, తలెత్తి నా కళ్లల్లోకి చూడగల ధైర్యం లేకపోయిందేం ?' ఆలోచిస్తున్నాను.

''ఆమె కిష్టమైతే నేను తయారుగా వున్నాను'' పలికిందో గంభీర స్వరం !

అందరి దృష్టీ అతనికేసి మళ్లింది. అందరి కళ్లూ ఆశ్చర్యంతో విప్పారినయ్. ఆ క్షణంలో అతడు నా కళ్లకి బుద్ధావతారం లాంటి శేషావతారం లా కనిపించలేదు — రాతి గుట్టల మధ్య నిల్చున్న మేరుపర్వతంలా కనిపించాడు.

కంచుమోగినట్టు కనకంబు మోగునా ? నిండు కుండ తొణకదు ! స్టిల్ వాటర్స్ రన్ డీప్ !

''ఛీర్సుటు మిస్టర్ శేషావతారం !'' మిత్ర బృందంలోంచి కేకలు.

''మై హార్ట్ కంగ్రాచులేషన్స్ టు మిస్టర్ శేషావతారం ! ఐ రియల్లీ ఎప్రిషి యేట్ హిస్ బోల్డ్ స్టెప్ !'' నేను నా హృదయపూర్వక అభినందనలు తెలుపు కున్నాను.

నా ప్రయత్నం ఫలించి నందుకు నాకెంతో సంతోషంగా వుంది.

* * *

శేషావతారానికి సొంత బుర్రతో ఆలోచిం చడం చేతకాదని మా మిత్రబృందం యొక్క అభిమతం అయితే కావచ్చు. కాని అతడు తీసుకున్న ఈ నిర్ణయం మాత్రం అనాలోచి తంగా తీసుకున్నదిగా నాకు అనిపించడంలేదు.

శేషావతారం మా సరస్వతిని చిన్నప్పటి నుండీ ఎరుగును. దాని అందచందాలే గాదు గుణగణాలు సైతం వాడికి తెలియనివి కావు. ఆ యిద్దరివీ పక్క పక్క ఇళ్లు కావు కాని వాళ్ల యింటి పెరడూ వీళ్ల యింటి పెరడూ కలిసే వుంటాయి. అంటే ఆ రెండింటినీ ఓ చిన్న మదురు గోడ వేరు చేస్తూ వుంటుంది. బాబాయిగారి యిల్లు పడమటి వీధిలో పడమటి ముఖంగానూ, శేషావతారం యిల్లు తూర్పు వీధిలో తూర్పు ముఖంగానూ వుంటాయి. అప్పుడప్పుడూ మా పిన్నిగారూ, శేషావతారం తల్లిగారూ పెరట్లోని మదురు గోడ దగ్గర నిల్చుని లోకాభి రామాయణం మాట్లాడుకోవడం గూడా కద్దు.

ఇకపోతే ఈ పెళ్లికి అతగాడి తలి దండ్రులు వొప్పుకోరన్న అనుమానం గూడా లేదు. శేషావతారం ఆ తలి దండ్రులకి ఒక్కగానొక్క కొడుకు. అతని అభీష్టానికి వాళ్లు అడ్డురారు. శేషావతారం తాతగారు బోలెడు ఆస్తి సంపాయించిపెట్టి పొయ్యారు. శేషావతారం తండ్రిగారు దాన్ని రెట్టింపు చేశారేగాని ఖర్చుపెట్టలేదు. ఈ ఆస్తి అంతటికీ ఏకైకవారసుడు శేషావతారం.అందు చేత శేషావతారం చిన్నప్పటి నుండీ అల్లారు ముద్దుగానే పెరిగాడు. అతని మాటలకి ఆ యింట్లో అడ్డులేదు. పైగా అతని పట్టు భల్లూకపు పట్టని ఆ తలిదండ్రులకి బాగా తెలుసు. పైగా శేషావతారం ఏ పని చెయ్య దలచుకున్నా ధైర్యంగా ముందుకి వెళ్లడమే గాని వెనుకంజ వెయ్యడం అలవాటు లేదు.

అందుచేత అతగాడి నిర్ణయాన్ని విన్నప్పటి నుండి నాకు బెంగ పట్టుకుంది. సరస్వతి నా కెంత దగ్గరో శేషావతారం కూడా నా కంత కావలసిన వాడు. మేమిద్దరం బాల్య స్నేహితులం. వాడికి అన్యాయం జరిగితే నేను సహించలేను. నా చెల్లెలి క్షేమం కోసం నా స్నేహితుడికి అన్యాయం చెయ్యాలంటే నా మనసు వొప్పుకోవడంలేదు. ఈ సమస్య నాకు తెగని సమస్యగానే తయారైంది. ఎంత ఆలోచించినా ఈ సమస్యకు సవ్యమయిన పరిష్కారం దొరకలేదు.

చివరికి ఈ రహస్యాన్ని శేషావతారానికి తెలియపరిచి వాడి నిర్ణయాన్ని మార్చడానికే నిశ్చయించు కున్నాను.

నేను స్నానపానాదులు ముగించుకుని శేషావతారం ఇంటి వద్దకి చేరుకునేసరికి



రాత్రి తొమ్మిది దాటింది. పని పిల్ల పార్వతి కాంపౌడు గేటు దగ్గర ఎదురైంది. నా గుండె దడ దడ లాడింది. పార్వతి మా బాబాయి ఇంట్లో కూడా పాచిపని చేస్తోంది. ఈ యింటి విషయాలు ఆ యింటికీ ఆ యింటి విషయాలు యీ ఇంటికీ చేర వెయ్యడంలో యిలాంటి మనుషులు స్థానిక వార్తా పత్రికల్లా పని చేస్తారు. శేషావతారం మా మిత్ర బృందం సమక్షంలో ప్రకటించిన నిర్ణయం యీ పాటికి మా బాబాయి చెవిదాకా వెళ్లి వుంటుంది. శేషావతారం మళ్లీ తన నిర్ణయాన్ని మార్చుకున్నాడని తెలిస్తే, దానికి కారకుడ్ని నేనేనని బాబాయి నన్ను అనుమానించవచ్చు. ఈ వేళప్పుడు నేను శేషావతారాన్ని కలుసుకోబోతున్న విషయం పార్వతి బాబాయికి తప్పకుండా చేరవేస్తుంది. ఇప్పుడేమిటి చెయ్యడం ?

ఒక్క క్షణం తటాపటాయించి అడుగు ముందుకే వేశాను.

నేను మేడమీదికి చేరుకునేసరికి శేషావతారం గది తలుపులు బార్లా తెరిచివున్నయ్. లోపల దీపం వెలుగుతోంది. శేషావతారం నైట్ గౌను ధరించి, కాళ్లు రెండూ టీపాయ్ మీదికి బార చాచి, సోఫాలో జారగిలపడి, సిగరెట్టు కాలుస్తూ స్పోర్ట్సు మేగజైన్ కాబోలు తిరగేస్తున్నాడు. నన్ను చూడగానే, "కమిన్ మై బోయ్! కమిన్ !" అంటూ టీపాయ్ మీంచి కాళ్లు తీసి, చేతనున్న మేగజైన్‌ను టీపాయ్ మీదకి విసిరి సర్ది కూచున్నాడు.

నేను వాడి కెదురుగా మరో సోఫాలో కూచోగానే "కమాన్, హావిట్ !" అంటూ టీపాయ్ మీదున్న సిగరెట్టు పాకెట్టునీ అగ్గిపెట్టెనీ ముందుకి తోశాడు.

నేను సిగరెట్టు వెలిగించుకుని గట్టిగా ఓ దమ్ము లాగి గాల్లోకి వదులుతూ "నీతో మాట్లాడాలి" అన్నాను.

'ఏమిటో అది ?' అన్నట్టు క్వొశ్చెన్ మార్కు ముఖం పెట్టాడు శేషావతారం.

"సరస్వతి పెళ్లి విషయం !" అన్నాను ముక్తసరిగా.

"చెప్పానుగా ! నే ను తయారుగానే వున్నాను–సరస్వతి అంగీకారం కూడా తీసుకోవాలిగా ?" అన్నాడు.

"సరస్వతికేం ? తప్పకుండా అంగీకరిస్తుంది. నీ విషయమే నేను తేల్చుకోవాలి ! –నీవు బాగా ఆలోచించుకునే యీ నిర్ణయానికి వచ్చావా ?"

శేషావతారం నవ్వాడు "అనుకున్న పని చేసెయ్యడమే గాని ఆలోచిస్తూ కూచోవడం నాకు చేతకాదు. ఈ విషయం మీ కందరికీ తెలుసు !" అన్నాడు.

"అది కాదు" విషయం ఎలా చెప్పాలో తోచక నసిగాను. "నీకో రహస్యం చెప్పాలి !"

"ఏమిటో అది ?"

"సరస్వతి యిప్పుడు వొట్టి మనిషి కాదు" గొంతు తగ్గించాను.

"అంటే ?" శేషావతారానికి అర్థం కాలేదు.

"నెల తప్పింది !"

"ఓశ్ అంతేనా? ఇంకేమో అనుకున్నాను" తేలిగ్గా వూపిరి పీల్చి చేతనున్న సిగరెట్టు పీకని ఆష్‌ట్రేలో నొక్కేశాడు.

"ఇప్పుడుచెప్పు ! నువ్వు సరస్వతిని చేసుకునేందుకు సిద్ధంగానే వున్నావా ?"

శేషావతారం నాకేసి చిత్రంగా చూసి పకపకా నవ్వేశాడు. "సరస్వతి నెల తప్పినంత మాత్రాన నా నిర్ణయం ఎందుకు మార్చుకోవాలి ? సరస్వతి కన్యకాదు. వయసులో వున్న విధవ. అలాంటి మనిషి కాలు జారడం ఆశ్చర్య పడాలిసిన విషయమేమీ కాదు" అన్నాడు.

నాకు మతి పోయింది. శేషావతారం యీ విషయాన్ని ఇంత తేలిగ్గా తీసుకుంటాడనుకోలేదు.

"అది కాదురా ! సరస్వతి రేపు కంటుందనుకో ! ఆ బిడ్డని నువ్వు నీ సంతానంగా స్వీకరించగలవా ?" అని ప్రశ్నించాను.

"ఏం ? ఎందుకు స్వీకరించను ? సరస్వతి నాదయితే, ఆమె కన్నబిడ్డ నాది కాదా ? కుంతి కన్న ఐదుగుర్నీ తన కన్న కొడుకుల్లా స్వీకరించలేదా పాండురాజు ?"

నా బుర్ర మరోసారి గిర్రున తిరిగింది.

ఎక్కడి కెక్కడ ముడి పెట్టాడు ? ఈ మాట అనడానికి ఎంత సంస్కారం కావాలి ! – ఎంత విశాల హృదయం కావాలి ! – ఎన్ని గుండెలుండాలి ! – ఇంత నిశితంగా ఆలోచించగల శేషావతారం మా మిత్రబృందం దృష్టిలో బుద్ధావతారమా ?

కొందరు అడ్డమైన సమస్యల నన్నింటినీ నెత్తిన వేసుకుని తెగ ఆలోచిస్తారు. తాము వాటిని ఆచరణలో పెట్టినా – పెట్టక పోయినా నలుగురిచేతా ఆలోచనాపరులుగా


# ఇది మీకు చాలాఉపయోగం

మీనిత్యవ్యవహారాలకు "వ్యవహారదర్శిని" అనే తెలుగుపుస్తకం చాలాఉపయోగం.అందులో ఏదైనా ఆస్తి కొనేటపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఏదైనాఉత్పత్తి, వ్యాపారం చేయాలంటే, దేనికెవరివద్దఎలాప్తైసెన్సు తీసుకోవాలి, వివిధజాతుల వివాహ, విడాకులనిబంధనలు, స్త్రీపురుషుల ఆస్తిహక్కులు, ఎవరితోనైనా ప్రమాదం రాబోతే పోలీసురక్షణను ఎవరికెలావ్రాయాలి. ప్రభుత్వ ఉచితఇండ్లస్థలాలు పొందటానికి ఎవరికెలాధరఖాస్తువ్రాసిపంపుకోవాలి, నోట్సు, దస్తావేజులు, ఒప్పందాలు, పత్రాలు, పిటీషన్లు, ఫిర్యాదులు, ఉత్తరాలుఎలావ్రాయాలి వాటివివిధ నమూనాలు. అనేకచట్టాలవివరాలు ఇలాంటివెన్నో మీకుఉపయోగపడేలా, తెలిసేలా వ్రాయబడ్డాయి. 300పేజీలపుస్తకం. ధర రూ. 12. పోష్టుఖర్చులదనం. దేశసేవప్రచురణలు, 2. ఇందిరానగరు, వెంగలరావు నగరువద్ద, హైదరాబాదు-500890 కు ఉత్తరంవ్రాసి మీఉపయోగానికోపుస్తకం వి.పి.పోష్టుద్వారా పొందండి

గుర్తింప బడడానికి, తమ ఆలోచనల్ని మాటల్లోకి మార్చి నలుగురి నెత్తినా రుద్దడానికి ప్రయత్నిస్తారు. మరికొందరు అత్యవసరమైతేతప్ప ఆలోచించరు. తమ ఆలోచనల్ని రహీమని ఆచరణలో పెట్టేసి అందర్నీ ఆశ్చర్య చకితుల్ని చేస్తారు. వీళ్లు ఎప్పుడోతప్ప బైట పడరు. వీళ్లకి ఎవరి మెప్పూ అవసరం లేదు. ఈ రెండవ శ్రేణికి చెందినవాడే శేషావతారం! —

వాణ్ని ఎలా అభినందించాలో తేలీక అమాంతం కౌగలించేసుకుని ''ఓరేయ్ శేషూ! నువ్వు మా లాంటి సగటు మనిషివి కావురా. మా కంటే ఎంతో ఎత్తుకి ఎదిగిపొయ్యావు సుమా!'' అన్నాను.

''ఒరేయ్! నన్ను మరీ అంత ఎత్తుకి ఎత్తేయకు, అక్కణ్ణించి జారితే నడుము విరగ్గలదు!'' అంటూ నవ్వేశాడు శేషావతారం.

*  *  *

మరుసటిరోజు ఉదయం తొమ్మిదింటి కల్లా స్నానపానాదులు ముగించుకుని బాబాయి గారింటికి బయలుదేరాను.

శేషావతారం సరస్వతిని చేసుకునేందుకు ముందు కొచ్చాడనీ, వాడి తలిదండ్రులు కూడా యీ పెళ్లికి సుముఖంగానే వున్నారనీ అప్పటికే వీధంతా పాక్కిపోయింది.

నేను బాబాయి యింటికి వెళ్లేసరికి బాబాయే స్వయంగా ఎదురొచ్చి నన్ను లోపలికి ఆహ్వానించారు. అప్పటికే యీ వార్త ఆయన చెవిదాకా వెళ్లి వుంటుంది. చాలా హుషారుగా కనిపించారు. నా గొంతుక వినగానే పిన్ని కూడా నవ్వుతూ ఎదురొచ్చింది. సరస్వతి మాత్రం సిగ్గుతో నా ముఖం చూళ్లేక కాబోలు నా కంట బడకుండా పెరట్లోకి పారిపోయింది.

''శుభస్య శీఘ్రం అన్నారు. ఈ వెలాఖరులో మంచిముహూర్తాలున్నాయట. ఆ శుభకార్యం కూడా నీ చేతుల మీదుగానే కానిచ్చేయరాదూ?'' అన్నారు బాబాయిగారు.

''సరస్వతి యిష్టం కూడా తెలుసు కోవాలిగా?''

''దాని మొహం! దానికి యిష్టాయిష్టాలు కూడానా? మన యిష్టమే దానిష్టం కూడాను.అయినా అనుమానం ఎందుకు? అన్నయ్యవి నీవే అడిగి తెలుసుకోవచ్చుగా?'' అంది పిన్ని.

''అలాగే'' అంటూ తిన్నగా సరస్వతి గదికేసి బయలుదేరాను.

గది తలుపులు రెండూ బార్లా తెరిచి వున్నయ్. కాని సరస్వతి గదిలో లేదు. మంచం పక్కన టీపాయ్‌మీద శ్రీదేవిగారి 'కాలాతీత వ్యక్తులు' నవల కనిపించింది. మంచంమీద కూలబడి నవల చేతిలోకి తీసుకుని పేజీలు తిప్పసాగాను. పుస్తకం లోంచి ఏదో ఫొటో క్రింద పడింది. ఫొటోని చేతిలోకి తీసుకున్నాను. నాకు చిన్న షాక్ తగిలినట్టయింది. బుర్ర పనిచెయ్యడం ప్రారంభించింది.

ఫోటోని పేజీల మధ్య దాచి, పుస్తకాన్ని టీపాయ్‌మీద పెట్టి, మంచంమీంచి లేచి గదిలోంచి బైటికి నడిచాను.

''అమ్మాయి బాత్‌రూముకెళ్ళినట్లుంది. వస్తుంది కూచో!'' అంటూ ఎదురైంది పిన్ని.

''ఫరవాలేదు, మళ్లీ వస్తాను. అర్జంటుగా నేనొక మిత్రుణ్ణి కలుసుకోవాలి!'' అంటూ ఇంట్లోంచి బైటపడి వీధిలోకి చేరుకున్నాను.

బుర్ర తీవ్రంగా పనిచేస్తోంది.

సరస్వతికి పంతొమ్మిదేళ్లు పూర్తయినా యిప్పటి వరకూ నా దృష్టిలో ఆమె యింకా చిన్నపిల్లే. అభం శుభం తెలీని వొట్టి అమాయకురాలు. చాలా పిరికిది కూడాను.

కాని నేనామెను పొరబాటుగా అంచనా వేసుకున్నానని యిప్పుడనిపిస్తోంది. ఆమె పైకి అలా కనిపించినా వయసుకు తగ్గ ఆలోచన్లూ, అవి ఫలించడానికి చెయ్యవలసిన ప్రయత్నాలూ ఆమె కున్నయ్.


సరస్వతి నెల తప్పిందని తెలిసి కూడా శేషావతారం ఆమెను పెళ్లాడడానికి వెనుకంజ వెయ్యలేదంటే కారణం యిప్పుడర్థమవుతోంది.

సరస్వతీ,శేషావతారం పరస్పరం ప్రేమించుకుంటున్నారు. శేషావతారం ప్రేమ కానుకగా బహూకరించిన అతని ఫోటోని సరస్వతి ప్రాణప్రదంగా తన వద్ద దాచుకుందంటే, ఆ యిద్దరి మధ్య కొంత గ్రంథం కూడా నడిచి వుండొచ్చు.

ఏది ఏమైతేనేం? సరస్వతి జీవితం బాగుపడడమే నాకు కావలసింది!

ఓ శుభ ముహూర్తాన వేణుగోపాలస్వామి దేవాలయంలో, సంఘ సంస్కర్తలుగా చలామణీఅవుతోన్న పురప్రముఖుల సమక్షంలో సరస్వతి శేషావతారంలు దంపతులయ్యారు. పెళ్లయిన వారం రోజులకి శేషావతారం భార్యను వెంట బెట్టుకుని 'హనీమూన్' కంటూ బయలుదేరాడు. మా మిత్ర బృందం లోని సభ్యులందరూ వాళ్ల వెంటబడి స్టేషన్ దాకా వెళ్లి దంపతులిద్దర్నీ రైలెక్కించి మరీ తిరిగి వచ్చారు. హనీమూన్ కెళ్లిన దంపతులు మూడు మాసాలు దాటుతున్నా యింటికి తిరిగి రాలేదు.

ప్రస్తుతం వాళ్లు ఎక్కడున్నదీ తెలియ పరుస్తూ, అంత క్రితం వాళ్లు తిరిగిన ప్రదేశాలూ— అక్కడి వింతలూ విశేషాలూ వర్ణిస్తూ వారానికో వుత్తరం, నాకో— వాళ్ల నాన్నగారికో వ్రాశేవాడు శేషావతారం. ప్రస్తుతం వాళ్లు దక్షిణదేశ యాత్ర ముగించుకుని, మద్రాసు చేరుకున్నారని



వారం రోజుల్లో యింటికి చేరుకోవచ్చునని, నాలుగోనెల మొదటి వారంలో కాబోలు నాకు వ్రాశాడు. వాళ్లు ఇల్లు చేరుకునేలోగా ఆఫీసు పనిమీద నేను ఢిల్లీ వెళ్లవలసి వచ్చింది. ఢిల్లీ నుండి నేను ఇల్లు చేరుకునేందుకు మూడు మాసాలు పట్టింది. అంటే నేను ఆ దంపతుల్ని చూచి ఏడు మాసాలు దాటుతోంది.

నేను ఢిల్లీ నుండి ఇల్లు చేరుకున్న రోజే స్నానపానాదులు ముగించుకుని ఒక గంటసేపు రెస్టు తీసుకుని శేషావతారం ఇంటికేసి బయలు దేరాను. అప్పటికే సూర్యుడు ఎర్రగా నిట్టూరుస్తూ పడమటి కొండల్లోకి జారుకుంటున్నాడు. ప్రేయసీ ప్రియులు సరదాగా ఏ సినిమాకో షికారుకో బయలుదేరే సమయం. ఈ వేళప్పుడు నేను వాళ్లను కలుసుకోగలనో లేనో అన్న అనుమానం తలెత్తింది. నా అనుమానం వొట్టిది కాలేదు. నేను వాళ్లింటి ముందు రోడ్డు మీదకు చేరుకునేసరికి శేషావతారం, సరస్వతీ ట్రిమ్‌గా డ్రెస్‌అయి కాంపౌండు గేటు దగ్గర దర్శనమిచ్చారు. నేననుకున్నంతా అయింది. ఆ సమయంలో వాళ్లని 'డిస్టర్బ్' చెయ్యడం యిష్టంలేక వాళ్ల కంట బడకుండా వెనక్కి తిరిగి వెళ్లి పోదామనుకుంటుండగా, "హలో మై డియర్! కమాన్" అంటూ ఒక్కవురుకున రోడ్డు మీదికి చేరుకుని గట్టిగా వాటేసుకున్నాడుశేషావతారం.

"ఢిల్లీ నుండి ఎప్పుడొచ్చావ్?" అని ప్రశ్నించాడు.

"మధ్యాహ్నమే దిగబడ్డాను... ఇంతకీ మీ రెక్కడికో బయలుదేరినట్టున్నారు?"

"అవును. కళామందిర్‌లో ఏదో కొత్త పిక్చర్ ఆడుతోందట. మీ చెల్లాయ్ ప్రపోజల్ పెడితే మనం దాన్ని గ్రాంట్ చేసేశాం. మాతోబాటు నువ్వూ రారాదూ సినిమాకి?"

"నోనో! నే నెందుకూ మీ మధ్య—పానకంలో పుడకలాగా? మీరు వెళ్ళిరండి! మళ్లీ కలుస్తా!" అంటూ వెనక్కి తిరిగి పోయాను.

"లాభంలేదు. ఏడునెల్ల తరువాత కనిపించిన మిత్రుడ్ని వొదిలేసి సినిమాకెళ్లడమేమిటి? సినిమాకేం? మరెప్పుడైనా వెళ్లొచ్చు! ఈ నాటికి మా ప్రోగ్రాం వాయిదా వేసుకున్నట్టే!" అంటూ పక్కకి తిరిగి "ఏమంటావ్?" అన్నట్టు సరస్వతికేసి చూశాడు శేషావతారం.

## ఓటి కుండలు

"అవునంటాను. కాని ఆమాటే ముందు నేనేగనక అని వుంటే, 'మీ అన్నయ్య కోసం బంగారం లాంటి ప్రోగ్రామ్ పోస్ట్‌పోన్ చేసుకోవడమా? డామిట్! అదేం కుదరదు' అని మీరనవచ్చు. ముందు మీరే అన్నారు గనక పేచీలేదు" అంది సరస్వతి చిలిపిగా నవ్వుతూ.

"విన్నావుట్రా, మీ చెల్లాయి స్టేట్—మెంటు? ఎంతయినా నీ చెల్లెలేగా! నీ తెలివి తేటల్లో కొంతయినా వుండక పోతుందా? ఏదీ తనమీద వేసుకోదు. అంతా నా నెత్తి మీదకు తోసి తేలిగ్గా చేతులు దులిపేసుకుంటుంది!— దట్సాల్‌రైట్! లెటజ్ గో బాక్ టు హోం!" అంటూ వెనక్కి తిరిగి ఇంటికేసి దారితీశాడు శేషావతారం.

అందరం డ్రాయింగు రూములోకి చేరుకున్నాం.

"రాకరాక వచ్చాడు మీఅన్నయ్య. ఇన్ని కాఫీ నీళ్లయినా పోస్తావా లేదా?" అన్నాడు శేషావతారం భార్యకేసి తిరిగి.

"మా అన్నయ్యకయితే కాఫీ యేం ఖర్మ, టిఫిన్ కూడా తయారుగానే వుంది!"

"మరి, నాకైతే కాఫీ కూడా లేదన్న మాట!"

అందరం నవ్వుకున్నాం.

సరస్వతి అక్కడ్నించి కిచెన్ కేసి బయలు దేరింది ఆమె అక్కడ్నించి కదిలేదాకా ఆమెనే గమనిస్తున్నాను. సరస్వతి ముఖంలో పునిస్త్రీ కళ కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. కాని శారీరకంగా నే నాశించిన మార్పులేమీ కనిపించలేదు. ఏడుమాసాలు దాటింది ఆమె నెలతప్పి - గర్భిణీ స్త్రీ తాలూకు చిహ్నాలు కొట్టొచ్చినట్టు కనిపించాలి! కానీ ఏమీ కనిపించదేం? ఏమిటీ చిత్రం!

అసలేంజరిగి వుంటుంది? నలుగుర్లో నగుబాటుగా వుంటుందని శేషావతారం తన భార్యకు 'ఎబార్షన్' చేయించాడా? ఆమెకి నెల తప్పిందని చెప్పినప్పుడు ప్రదర్శించిన నిర్లక్ష్యతా, నిర్భయమూ ఏమయింది?

ఆలోచనలో పడ్డాను.

"ఏమిట్రోయ్, నిల్చునే అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్ ఈ మధ్య నేనూ ఆలోచించడం నేర్చుకున్నానులే. నీ సమస్యలేమిటో నాకూ చెబుదూ, నేనూ ఆలోచిస్తాను" అంటూ శేషావతారం సోఫాలో కూలబడి టీపాయ్ క్రిందనున్న న్యూస్‌పేపరు పైకి తీశాడు.

నేనూ అతని కెదురుగా సోఫాలో కూర్చుంటూ, "మరేం, సరస్వతి పెళ్లికాక ముందే నెలతప్పిందన్నారు, కాని ఏడుమాసాలు దాటుతున్నా ఆమెలో అలాంటి చిహ్నాలేమీ కనిపించడంలేదు" అన్నాను నా సందేహాన్ని బయట పెడుతూ.

శేషావతారం పకపకా నవ్వేశాడు. "అప్పుడు ఆ చిట్కా ప్రయోగించకపోతే మీ బాబాయి లాంటి ఛాందసుడు దిగివచ్చేవాడా? సరస్వతికి మళ్లీ పెళ్లి అయ్యేదా?" అన్నాడు.

కొరడాతో వీపు మీద ఛెళ్లుమని పించినట్టయింది. "ఏమిటి? అంతా వొట్టిదేనా? మా బాబాయి దిగి వచ్చేందుకు మీ రిద్దరూ కలిసి ఆడిన నాటకమన్నమాట!" ఆశ్చర్యంగా అతని ముఖంలోకి చూశాను.

అంతలోకితమే టిఫిన్ ప్లేటూ, మంచినీళ్ల గ్లాసూ పట్టుకుని అక్కడికి చేరుకున్న సరస్వతి వాటిని టీపాయ్ మీద పెడుతూ, "ఆ నాటకానికి సూత్రధారుడు మీ బుద్ధావతారం బావగారే సుమా!" అంటూ ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ కిచెన్ కేసి వెళ్లిపోయింది.

### దీర్ఘాయుష్షుకు చిట్కాలు!

వృద్ధులైన వారు ఆహారం తగ్గించడం వల్ల ఎక్కువ కాలం జీవించటానికి అవకాశమున్నదని పశ్చిమ జర్మనీ పరిశోధకులు తెలియచేశారు. 55 సంవత్సరాలు పైబడిన వారు చక్కెర, క్రొవ్వులను తగ్గించాలి. ముఖ్యంగా క్రొవ్వు పదార్థాలు శరీర బరువు ననుసరించి రోజుకు ఒక కిలోగ్రాముకు 0.8 గ్రాములు మించకూడదు. ప్రొటీన్ల కోసం ఎక్కువగా కాయకూరలు తినాలి. తగినన్ని విటమిన్లు. రోజూ 1.5 లీటర్ల నీరు, ఇతర ద్రవ పదార్థాలు తీసుకోవాలి. ఆహారం తగ్గించడమే కాక, పోషక పదార్థాలు గల ఆహారం తీసుకోవాలి. ఆహారం బాగా నమలడం కూడా అవసరమే.